

మాట్లాడుతున్న బీజేపీ పార్టీ అభ్యర్థి గోడం నగేష్

అసత్య ఆరోపణలు చేయడం సరికాదు

● బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్

ఆదిలాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లో ఎన్నికల సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని బీజేపీ పార్టీ అభ్యర్థి గోడం నగేష్ అన్నారు. జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవన్నారు. ముఖ్యమంత్రికి ఏం మాట్లాడాలో తెలియక సబ్జెక్టు లేని విమర్శలు చేయడం సరికాదన్నారు. ఇంద్రవెల్లి హంతకులే ఎన్నికల సందర్భంగా సంతాప సభలు పెడుతూ ఆదివాసీల ఓట్ల కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రచార సభలో తప్పుగా ప్రసంగించి ఓట్లు దండుకోవడానికి ప్రయత్నించారని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వస్తే డిసెంబరు 9న ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. 1981లో అమాయక ఆదివాసీలను కాల్చి చంపింది కాంగ్రెస్ పార్టీ కాదా? అని ప్రశ్నించారు. ఇందులో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, పలువురు పార్టీ నేతలు, తదితరులున్నారు.



పొలిటికల్.. వార్!

- సీఎం పర్యటనతో వేడెక్కిన జిల్లా రాజకీయాలు
- విమర్శనాస్త్రాలకు పదును పెడుతున్న ప్రధాన రాజకీయ పార్టీలు
- పోటాపోటీగా ప్రచారంలో దూసుకెళ్తున్న పార్టీల అభ్యర్థులు
- ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వ్యూహాలు
- జిల్లావ్యాప్తంగా సమీపిస్తున్న పార్లమెంట్ ఎన్నికలతో రసవత్తరంగా మారుతున్న రాజకీయాలు

ఆదిలాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఠారెత్తిస్తున్న ఎండలకు ఎన్నికల వేడి తోడవడంతో జిల్లా రాజకీయాలు మరింత హీటెక్కుతున్నాయి. ఇంకా అసెంబ్లీ ఎన్నికల వేడి చల్లారనే లేదు.. మళ్లీ లోక్‌సభ ఎన్నికలతో పొలిటికల్ వార్ సాగుతోంది. దాదాపుగా ఈ వేసవి కాలమంతా ఎన్నికల హడావుడే కనిపిస్తోంది. జూన్ 4న లోక్‌సభ ఎన్నికలు ముగియగానే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ప్రధాన పార్టీలతో పాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. మరో రెండు రోజుల్లో నామినేషన్ ప్రక్రియ ముగియనుంది. ఆ తర్వాత జిల్లా రాజకీయాలు మరింత హీటెక్కే అవకాశం కనిపిస్తోంది. రాజకీయ పార్టీలన్ని గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. ప్రస్తుతం ముందున్న లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రధాన పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. అభ్యర్థులను ఎంపిక చేసిన ఆయా పార్టీలు.. ప్రచారంతో ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల జిల్లా పర్యటనతో రాజకీయాలు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. జనజాతర బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు జిల్లా రాజకీయాల్లో కలకలం రేపుతున్నాయి. ఇన్నాళ్లు కొంత సైలెంట్‌గానే కనిపించిన రాజకీయం.. నేతల మాటల తూటాలతో చర్చకు దారి తీస్తోంది. మొత్తానికి చెమటలు పుట్టించే వేసవిలో ముచ్చెమటలు పట్టించే వ్యాఖ్యలు నేతలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎన్నికలు దగ్గర పడుతున్నకొద్ది ప్రధాన పార్టీలు పట్టుబిగించడంతో జిల్లా రాజకీయాలు మరింత రసవత్తరంగా మారుతున్నాయి.

విపక్షాలే టార్గెట్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనలో విపక్షాలను టార్గెట్ చేస్తూ ప్రసంగించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల ప్రచార సభ కావడంతో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అంతగా దృష్టి సారించినట్లు కనిపించ లేదు. బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలే లక్ష్యంగా సీఎం ప్రసంగం సాగింది. విపక్షాల అభ్యర్థులపై తీవ్రమైన విమర్శలు చేయడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. ముఖ్యంగా ప్రధాన




పార్టీల అభ్యర్థులంతా ఆదివాసీలే కావడంతో ఆ సామాజిక వర్గానికి మరింత దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. అంతేకాకుండా బీజేపీ సిట్టింగ్ స్థానంపై ప్రత్యేకదృష్టిని సారించిన కాంగ్రెస్.. ఎలాగైనా ఈసారి పాగా వేసేందుకు అన్నిరకాల ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఎన్నికలకు మరో 20 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉండడంతో గెలిచేందుకు పక్కా ప్లాన్‌తో ముందుకెళ్తోంది.

వ్యక్తిగత విమర్శలతో దాడి

నామినేషన్‌ల దాఖలుకు గడువు సమయం దగ్గర పడడంతో ప్రధాన పార్టీలు విమర్శనాస్త్రాలకు మరింత పదును పెడుతున్నాయి. ఇన్నాళ్లు పార్టీల విధానాలు, అభివృద్ధి, పథకాల అమలు, హామీలతో ఇరుకున పెట్టే ప్రయత్నం చేసిన ప్రధాన పార్టీల నేతలు.. ప్రస్తుతం వ్యక్తిగత విమర్శలతో ఎదురుదాడికి దిగుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులపై వ్యక్తిగత విమర్శలు చేయడం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. బీజేపీ పార్టీ అభ్యర్థి గోడం నగేష్‌పై తీవ్రమైన విమర్శలు చేస్తునే బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు ఇద్దరూ దొరలే అంటూ కామెంట్ చేయడం గోడం నగేష్ ఆదివాసీలను దూరం పెట్టారన్న ఆరోపణలు చేయడంతో బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు సీఎం వైఖరిని తీవ్రంగా తప్పుబడుతూ మండిపడుతున్నారు. అదేవిధంగా అసలు జిల్లాకు కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందో? సీఎం చెప్పాలంటూ గట్టిగా ప్రశ్నిస్తున్నారు. సీఎం ఆదివాసీలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

స్పీడు పెంచిన అభ్యర్థులు

తీవ్రమైన ఎండలను లెక్కచేయకుండా అభ్యర్థులంతా లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని చుట్టేస్తున్నారు. ఉదయం 6గంటల నుంచే ప్రచార బాట పడుతున్నారు. మధ్యాహ్నం సమయంలో ఎక్కడో ఓ చోట సేదతీరుతూ.. ముఖ్యనేతలతో మంతనాలు జరుపుతున్నారు. మళ్లీ సాయంత్రం ప్రచారాన్ని ప్రారంభించి రాత్రి 8, 9గంటల వరకు ప్రచారంలోనే నిమగ్నమవుతున్నారు. ఆ తర్వాత పార్టీ పరిస్థితి, చేరికలపై ప్రత్యేకదృష్టిని సారిస్తున్నారు. రోజుకో రకంగా ప్రచారాన్ని నిర్వహిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా పార్లమెంట్ పరిధిలోని సమస్యలపై దృష్టి సారిస్తున్నారు. పార్టీ అమలు చేస్తున్న పథకాలతో పాటు సొంత ఎజెండాతో ప్రచారానికి ఊపునిస్తున్నారు. పార్టీ అగ్రనేతల పర్యటనల సమయంలో భారీ జన సమీకరణ చేస్తున్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజక వర్గాలు ఉండగా.. ఎక్కువగా ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లోనే అభ్యర్థులు ప్రచారాన్ని చేపడుతున్నారు. ఇన్నాళ్లు తమ దగ్గరి అనుచరులతో ప్రచారాన్ని చేపట్టిన అభ్యర్థులు.. ప్రస్తుతం పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలను వెంటేసుకుని ప్రచార బాట పడుతున్నారు. అయితే లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థులంతా ముందుకెళ్తున్నా.. ఓటర్ల మద్దతు ఎవరికన్నదే ఆసక్తిగా మారింది.





బీఆర్‌ఎస్ నేతలతో కలిసి నామినేషన్ దాఖలు చేస్తున్న ఆత్రం సక్కు

ఆరవ రోజు ఆరు నామినేషన్ల దాఖలు

ఆదిలాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఆరవ రోజైన మంగళవారం ఆరు నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా రిటర్నింగ్ అధికారి రాజర్షిషా తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కు మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిలతో కలిసి తన తొలి నామినేషన్‌ను దాఖలు చేశారు. ఆ తర్వాత ఎమ్మెల్సీ దండె విఠల్ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు జాన్సన్ నాయక్, లోలం శ్యాంసుందర్, రాంకిషన్‌రెడ్డి, మర్సుకోల సరస్వతిలతో కలిసి రెండవ నామినేసన్ సెట్‌ను దాఖలు చేశారు. అలాగే ఇండియా ప్రజాబంధు పార్టీ నుంచి గేడంసాగర్ రెండు నామినేషన్ సెట్లను దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా మేస్రం గంగాదేవి రెండవ సెట్ నామినేషన్‌ను దాఖలు చేయగా చౌహాన్‌రాము లోక్‌సభ స్థానానికి నామినేషన్ వేశారు. మిగిలిన రెండు రోజుల్లో భారీగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉంది. బుధవారం బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ నామినేషన్‌ను వేయనున్నారు. ఆయనతో పాటు మరికొంత మంది నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు.

సంక్షిప్త సమాచారం

‘నేడు శ్యామ్‌పూర్‌లో అంబేద్కర్ జయంతి ఉత్సవాలు’

ఉట్నూర్ ఏప్రిల్ 23: మండలంలోని షాంపూర్‌లో బుధవారం అంబేద్కర్ జయంతి ఉత్సవాలు నిర్వహించ తలపెట్టినట్లు షాంపూర్ అంబేద్కర్ యువజన సంఘ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సమతా సైనికదళ్ సౌత్ ఇండియా నాయకులు కాంబ్లె దిగంబర్, ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ అంబేద్కరిస్ట్ దుర్గం భాస్కర్, అంబేద్కర్ సోగల సుదర్శన్‌లు హాజరవుతున్నారని, సాయంత్రం నాలుగు గంటల నుంచి 6గంటల వరకు జరుగనున్న ఈ కార్యక్రమాలకు భారీ సంఖ్యలో ప్రజలు రావాలని కోరారు.

రేపు బీజేపీ ఎంపీ అభ్యర్థి నామినేషన్ : ఎమ్మెల్యే పాయల

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 23: బీజేపీ ఎంపీ అభ్యర్థి నామినేషన్‌ను ఈ నెల 24న వేయనున్నట్లు దీనికి కేంద్ర విదేశాంగ మంత్రి శివశంకర్, ఓబీసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ ముఖ్య అతిథులుగా రానున్నారని ఎమ్మెల్యే పాయల శంకర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాంలీలా మైదానంలో ఏర్పాట్లను ఎంపీ అభ్యర్థి నగేష్‌తో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే శంకర్, ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ మాట్లాడుతూ నా మినేషన్ వేయడానికి ర్యాలీగా వెళ్తున్నట్లు తెలిపారు. ఉదయం పది గంటలకు రాంలీలా మైదానం నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్‌ను వేయడం జరుగుతుందని, పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు. ఇందులో రమేష్ రాథోడ్, అశోక్ ముస్తాపూరే, అంకత్ రమేష్, లాలా మున్న, ప్రవీణ్, రాష్ట్రపాల్, ముకుంద్, అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

‘త్వరలో జిల్లాలో మాజీ సీఎం బహిరంగ సభ, బస్సుయాత్ర’

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 23: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా త్వరలో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ బహిరంగ సభలు, బస్సుయాత్రలు రాష్ట్రవ్యాప్తంగా ఉంటాయని.. అందులో భాగంగానే ఆదిలాబాద్‌లో కూడా బహిరంగ సభ ఉంటుందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. జోగు రామన్న మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా మాజీ సీఎం కేసీఆర్ ప్రచారం నిర్వహిస్తారన్నా రు. బస్సుయాత్రలు, బహిరంగ సభలుంటాయని తెలిపారు. ఇందులో భాగంగానే త్వరలో చేపట్టే బస్సుయాత్ర కాగజ్‌నగర్, ఆదిలాబాద్‌లో బహిరంగ సభ ఉంటుందని, కార్యకర్తలు సభను విజయవంతం చేయాలన్నారు. ఇదులో ఎమ్మెల్సీ దండేవిఠల్, ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, అనిల్‌జాదవ్, ఎంపీ అభ్యర్థి ఆత్రంసక్కు, గ్రంథాలయ చైర్మన్ మనోహర్, ఆదిలాబాద్ ఎంపీపీ గండ్రత్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన యువకులు

బోథ్, ఏప్రిల్ 23: మండలంలోని ధన్నూరు గ్రామానికి చెందిన దాదాపు 50 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి సమక్షంలో వీరందరూ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ నాయకులు అశ్విన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఇందులో సోనాలతో పాటు ఆయా గ్రామాల చెందిన నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో ఘనంగా హనుమాన్ జయంతి

● భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు ● వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు ● పలుచోట్ల అన్నదానం ● పాల్గొన్న ప్రముఖులు

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 23: హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం జిల్లావ్యాప్తంగా హనుమాన్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఇందులో భాగంగా జిల్లాకేంద్రంలోని అతి పురాతనమైన విజయ మనుమాన్ ఆలయంతో పాటు పలు ఆలయాలలో ఉదయం నుంచి భక్తుల రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా అత్యంత నియమనిష్టలతో భక్తులు పూజలు నిర్వహించారు. మరో వైపు పలు ప్రాంతాలో హనుమాన్ పల్లకీ ఊరేగింపు చేపట్టారు. కాగా పట్టణంలోని రాంనగర్, తిర్పెల్లి, భాగ్యనగర్, ఒడ్డరుకాలనీ,ఇందిరానగర్ కాలనీలోని హనుమాన్ ఆలయాలను ఎమ్మెల్యే పాయల శంకర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో పార్లమెంట్ ఎన్నికల కోఇన్‌చార్జీ అశోక్ ముస్తాపురే, ముకుందరావు, విశాల్, సతీష్‌రాము, సురేష్, దశరథ్, రఘు, తదితరులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో హనుమాన్ పల్లకీ ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

● ఉట్నూర్‌లో భారీ శోభాయాత్ర

ఉట్నూర్: మండలంలో మంగళవారం హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మండలంలోని లక్కారం హనుమాన్ మందిరంలో పూజలు చేసిన హనుమాన్ భక్తులు అక్కడి నుంచి శోభాయాత్రను చేపట్టారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణక్క, ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, వైస్ ఎంపీపీ దావులే బాలాజీలు లక్కారం ఆలయం వద్ద శోభాయాత్రను ప్రారంభించారు. లక్కారం పురవీధుల నుంచి ఉట్నూర్‌లోని హను మాన్ మందిరం వరకు శోభాయాత్ర జరిగింది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గండి కోట మొగిలి, ఎస్సై మనోహర్‌ల ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

● కోసాయి ఆలయానికి భక్తుల తాకిడి

తలమడుగు: హనుమాన్‌జయంతిని పురస్కరించుకుని మండలంలోనరి అతి పురాతనమైన తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో ఉన్న కోసాయి రిట్ సంకట యోజన హనుమాన్ ఆలయంలో తలమడుగు జడ్పీటీసీ గోకగణేష్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణలక్ష్మి రాజేశ్వర్, మాజీ సర్పంచ్ సుభాష్, మాజీ జడ్పీటీసీ బాపన్న, సీనియర్ నాయకులు ప్రకాష్‌రావు,నాతో పాటు గ్రామస్థులు, భక్తులు తెలంగాణ, మహారాష్ట్ర నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడ్పీటీసీ మాట్లాడుతూ ఈ ఆలయం అతి పురాతనమైందని, ఆదిలాబాద్ ఇన్‌చార్జీ మంత్రి సీతక్క త్వరలోనే కోసాయికి రావడం జరుగుతుందన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా తెలంగాణ, మహారాష్ట్ర క్రీడాకారులతో ఏర్పాటు చేసిన అంతర్ రాష్ట్ర కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు.

గుడిహత్నూర్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామికి ఉదయం పూజలతో పాటు అభిషేకాలు చేశారు. ఆంజనేయ స్వామి చిత్ర పటంతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

తాంసి: హనుమాన్ జయంతి వేడుకలను మంగళవారం మండలంలోని ఆయా గ్రామాలలో ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా ఆంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకు భక్తులు బారులు తీరారు. మండలంలోని పొన్నారి, తాంసి, కప్పర్ల, జామిడి, హస్నాపూర్ గ్రామాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అనంతరం ఆయా గ్రామాలలో హనుమాన్ శోభాయాత్ర ఏర్పాటు చేశారు.

● పొన్నారిలో బోథ్ ఎమ్మెల్యే పూజలు

హనుమాన్ జయంతిని పురస్కరించుకుని పొన్నారిలోని ప్రముఖ అభయాంజనేయ ఆలయంలో బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట భీంపూర్ జడ్పీటీసీ సుధాకర్, తాంసి వైస్ ఎంపీపీ రఘు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో హనుమాన్ శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్



పొన్నారిలో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



గుడిహత్నూర్ ఎక్స్ రోడ్డు వద్ద ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఫుడ్‌సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు

● జిల్లాకేంద్రంలో ఓ హోటల్‌లో కిచెన్‌తో పాటు రికార్డుల పరిశీలన ● నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో రూ.25 వేల జరిమానా



● జిల్లాకేంద్రంలోని హోటల్ యజమానికి నోటీసును అందజేస్తున్న ఫుడ్‌సేఫ్టీ, మున్సిపల్ అధికారులు

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 23: జిల్లాకేంద్రంలోని ఓ హోటల్‌లో తయారు చేసిన వెజ్‌బిర్యానిలో బొద్దింకలు రావడంతో మంగళవారం ఫుడ్‌సేఫ్టీ అధికారి శ్రీధర్, మున్సిపల్ కమిషనర్లు హోటల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెస్టారెంట్లో కిచెన్ సెక్షన్‌ను, పలు రికార్డులను పరిశీలించారు. హోటల్ యజమానులు శానిటేషన్ విషయంలో నాణ్యత ప్రమాణాలను పాటించకపోవడంతో మున్సిపల్ అధికారులు రూ.25వేల జరిమానా విధించారు. కనీస నాణ్యత ప్రమాణాలు, శానిటేషన్ పాటించక పోవడంతో ఫుడ్‌సేఫ్టీ డిపార్ట్‌మెంట్ నుంచి 15 రోజుల్లోగా మెరుగుపర్చుకోవాల్సిందిగా ఇంప్రూవ్‌మెంట్ నోటీసును అందించారు. అదేవిధంగా నాలుగు రకాల ఆహర శ్యాంపుల్స్‌ని హైదరాబాద్ టెస్టుకు పంపించడం జరిగిందని తెలిపారు. వాటి ఫలితాలు వచ్చిన వెంటనే ఏమైనానాసిరకమైన పదార్థాలు ఉన్నట్లుయితే శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇందులో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



● హోటల్‌లోని కిచెన్ సెక్షన్‌లో వంటకు సంబంధించి వస్తు సామగ్రిని పరిశీలిస్తున్న అధికారులు

నిర్మల్ జిల్లాలో వడగళ్ల వర్షంతో దెబ్బతిన్న పంటలు

- ఆందోళన చెందుతున్న రైతులు
- పంటలను పరిశీలించిన బైంసా ఆర్డీవో


విట్టోలిలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న ఆర్డీవో


వర్షాలకు పాడైన వాటర్‌మిలాన్ పంటను పరిశీలిస్తున్న అధికారులు

ముథోల్, ఏప్రిల్ 23 : నిర్మల్ జిల్లాలోని పలు గ్రామాల్లో సోమవారం అర్ధరాత్రి వేళలో ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసింది. దీంతో వరి, వాటర్‌మిలన్, మామిడి రైతులు నష్టపోయారు. అలాగే పండించిన దిగుబడుగులను కల్లాల్లో ఎండబెట్టారు. అయితే ఈ కురిసిన అకాల వర్షానికి దిగుబడులు తడిసిపోయాయి. దీంతో రైతన్న కలవరపడుతున్నాడు. కొంతమంది రైతులు పంటను కోసి కల్లాల్లో ఆరబెట్టగా మరి కొంత మంది రైతులు పండించిన పంట కోసే సమయంలో వడగళ్ల వర్షం కారణంగా దెబ్బతిన్నది. మండలంలోని విట్టోలి గ్రామ శివారులో అధిక శాతం పంటలు దెబ్బతిన్నట్లు ఏఈవో సిరాజ్ తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో వరి, మొన్నజొన్న, వాటర్ మిలన్, మామిడి పంటలు ఈ వర్షానికి దెబ్బతిన్నాయని, ప్రభుత్వం తమకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఈదురు గాలుల మూలంగా చెట్లు విరిగిపడ్డాయి. ఏదిఏమైనా అకాల వర్షంతో రైతులకు నష్టం తప్పలేదు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఏదో ఒక కారణంగా రైతు నష్టపోయిన ప్రభుత్వం ఇంతవరకు నష్టపరిహారం చెల్లించడం లేదని రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

పంటను పరిశీలించిన బైంసా ఆర్డీవో

మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం సాయంత్రం కురిసిన వర్షం కారణంగా దెబ్బతిన్న పంటలను మంగళవారం భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి పరిశీలించారు. మండలంలోని విట్టోలి శివారులో వడగళ్ల వర్షంతో దెబ్బతిన్న వరిపంటతో పాటు వాటర్‌మిలన్ పంటను పరిశీలించారు. నష్టం జరిగిన పంట వివరాలను సేకరించి తెలియజేయాలని ఏఈవో సిరాజ్‌ను ఆదేశించారు. అలాగే మండలంలోని బోరిగాం గ్రామంలో వరి కొనుగలు కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే విట్టోలిలోని సాయికృప రైస్‌మిల్‌ను పరిశీలించి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట తహసీల్దార్ విఠల్, ఆర్ఐ నారాయణ, ఏఈవో సిరాజ్, రైతులు, తదితరులు ఉన్నారు.


గాలివానకు నేల రాలిన మామిడి

కుభీర్ మండలంలో వర్ష బీభత్సం


చౌండిలో నేలకొరిగిన మొక్కజొన్న

కుభీర్, ఏప్రిల్ 23 : మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం వర్షం బీభత్సం సృష్టించింది. ఈదురుగాలుతో కూడిన వర్షానికి పంటలు నేలకొరిగాయి. మండలంలో వర్ని గ్రామంలో ఓ రైతుకు చెందిన మామిడి కాయలు నేలకు రాలిపోయాయి. పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, వృక్షాలు నేలకొరిగాయి. దీంతో సోమవారం రాత్రి మొత్తం విద్యుత్ అంతరాయం ఏర్పడింది. మంగళవారం కూడా అదే పరిస్థితి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

రేపటి నుంచి ఓటర్ స్లిప్స్ పంపిణీ

● టెలీకాన్ఫరెన్స్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజార్షిషా

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 23: ఈనెల 25 నుంచి ఓటర్ స్లిప్స్ పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు రిటర్నింగ్ అధికారి రాజార్షిషా అన్నారు. మంగళవారం అధికారులతో టెలి కాన్ఫరెన్స్‌నిర్వహించి అన్ని సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఇంటికి ఓటర్ స్లిప్ పంచడంతో పాటు ఓటర్ గైడ్‌ను కూడా అందించాలన్నారు. గ్రామాల్లో మున్సిపాలిటిలో బూత్ స్థాయి అధికారులు ఓటర్ స్లిప్పులు పంపిణీలో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఓటర్‌కు అందేలా బాధ్యతగా పని చేయాలని సూచించారు. ఎన్నికల పర్యవేక్షణలో భాగంగా సెక్టోరల్ అధికారులను నియమించడం జరిగిందని, పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు గ్రామాల్లో మున్సిపాలిటిలలోని పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసుకునేందుకు సిద్ధం కావాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని పోలింగ్ కేంద్రాల్లో మంచినీరు,టెంట్లు సమకూర్చుకోవాలన్నారు. వయోవృద్ధులు, వికలాంగ ఓటర్ల సదుపాయ నిమిత్తం విల్ చైర్లను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు.మున్సిపల్ పంచాయతీ అధికారులు సమన్వ యంతో ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలకు ఎన్నిక సామాగ్రిని చేరవేసేందుకు వీలుగా వాహనాలను సమకూర్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా, జిల్లా అధికారులు, ఎంపీడీవో, తదితరులు పాల్గొన్నారు.

'ఎంపీ అభ్యర్థిపై విమర్శలు సరికాదు'

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 23: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌పై విమర్శలు చేయటం సరికాదని మాజీ ఎంపీపీ కనక తుకారం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. అంతేకాకుండా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మె బొజ్జు పటేల్, బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌ను క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారం, బీజేపీ మండల అధ్యక్షుడు అరెల్లి రాజలింగం, ఎంపీటీసీ పడ్వాల్ విజయ్‌సింగ్, నాయకులు మరప రాజు, రాథోడ్ భీంరావు, కనక హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన వేరుశనగ దిగుబడి

● పల్లీ నూనెకు అధిక ధర

● వేరుశనగకు మార్కెట్‌లో మద్దతుధర అంతంత మాత్రమే..


వేరుశనగలను పరిశీలిస్తున్న దృశ్యం

తాంసి, ఏప్రిల్ 23: వేరుశనగ దిగుబడి ఈ సంవత్సరం అంతంత మాత్రమే అని చెప్పాలి. పంట చేతికి రాక ముందు మార్కెట్‌లో క్వింటాల్ వేరుశనగలకు ఎనిమిది వేల నుంచి 8,500 పలికింది. ప్రస్తుతం క్వింటాల్‌కు 4,500 నుంచి 4,840 ధర పలుకుతుంది. ఈసారి ఈ వేరుశనగ దిగుబడి కూడా పూర్తిగా తగ్గింది. ఎకరానికి ఐదు నుంచి ఏడు గంటల దిగుబడి మాత్రమే వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. జిల్లావ్యాప్తంగా ఈ సంవత్సరం సుమారు 14 హెక్టార్లలో వేరుశనగను సాగు చేశారు. తాంసీ మండలంలో 1220 ఎకరాల్లో సాగు చేయగా.. ప్రస్తుతం 80 శాతం వరకు కోతకు వచ్చింది. ఎకరానికి సుమారు రూ.18 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేశామని రైతులు అంటు న్నారు. మార్కెట్‌లో మాత్రం ధరలు చూస్తే ఏ మాత్రం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ధర విషయానికి వస్తే కిలో దర రూ. 250 నుంచి రూ.280 పలుకుతుందని అలాంటప్పుడు పల్లికాయలకు ఎందుకు ఇవ్వడం లేదని అంటున్నారు. ఆదుకుంటుంది అనుకున్న వేరుశనగ తమ్ముడు నట్టేట ముంచింది అని అన్నదాతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు కల్పించాలి. ప్రభుత్వ రంగ సంస్థ కొనుగోలు చేయించాలని రైతులు కోరుతున్నారు.

ఉత్తమ సేవకులకు అవార్డులు

ఉట్నూర్, ఏప్రిల్ 23: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఏజెన్సీ గ్రామాలలోని ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్న 108 ఉద్యోగులకు అవార్డులు లభించాయి. ఆదిలాబాద్ జిల్లాలో 108 అంబులెన్స్‌లో చేస్తున్న సేవల గాను 2023లో రాష్ట్రస్థాయి ఉత్తమ సేవ అవార్డును హైదరాబాద్‌లో మంగళవారం జీవీకే ఎంఆర్ఐ గ్రీన్ సర్వీస్ డైరెక్టర్ వెంకటరమణ, స్టేట్ హెడ్ ఖలీద్, ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ల చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలోని ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించి ప్రజల మన్ననలతో పాటు సంస్థకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అవార్డు పొందిన 108 ఈఎంటీ శంకర్, పైలెట్ సచిన్, కో ఆర్డినేటర్ తిరుపతిలకు అవార్డులతో పాటు క్యాస్ మెమోలు అందించారు.


పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్, మఠాధిపతి యోగానంద సరస్వతి


పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగుతున్న శోభాయాత్ర


పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు, యువకులు

ఆదిలాబాద్‌లో ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

● ప్రారంభించిన ఎమ్మెల్యే పాయల, మఠాధిపతి యోగానంద సరస్వతి ● పాల్గొన్న విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 23: హనుమాన్‌జయంతి ఉత్సవాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారని ఎమ్మెల్యే పాయల శంకర్ తెలిపారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయ్ హనుమాన్ శోభాయాత్రను మంగళవారం ఎమ్మెల్యే పాయల శంకర్, గోపాల కృష్ణ మఠాధిపతి ప్రారంభించారు. పట్టణంలోని శ్రీరామగోపాలకృష్ణ మఠం వద్ద హనుమాన్ విగ్రహానికి మఠాధిపతి యోగానందసరస్వతితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి శోభయాత్రను ప్రారంభించారు. హనుమాన్ దీక్షను స్వీకరించిన యువకులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ నియమనిష్టలతో ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే ఫండ్ నిధులతో పట్టణ, గ్రామాలలో హనుమాన్ వ్యాయామశాలలు ఏర్పాటు చేయడానికి ఆలోచిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, బీజేపీ నాయకులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

● సేవలాల్ జగదాంబ దేవి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

నేరడిగొండ: హనుమాన్ జయంతి పురస్కరించుకుని నేరడిగొండ మండలంలోని తమ స్వగ్రామం రాజురా గ్రామంలో ఉన్న శ్రీసంత్‌సేవలాల్ జగదాంబ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే అనిల్‌జాదవ్. అనంతరం అక్కడి నుంచే బీఆర్ఎస్ పార్టీ ప్రచారాన్ని ప్రారంభించారు. వీరితో పాటు ఎంపీపీ రాథోడ్‌సజన్,వైస్ ఎంపీపీ మహేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు జహీర్, పండరి, మండల కన్వీనర్ శివారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం నేరడిగొండలో పెద్ద హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

బోథ్: మండలంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని సోనాల, కౌటా(బి), బోథ్, దన్నూర్, సాకేర గ్రామాలలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని కౌటా(బి) గ్రామంలో గ్రామస్తులంతా కలిసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని సాకేర గ్రామంలో నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకలలో స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ జడ్పీటీసీ డాక్టర్ సంధ్యారాణి, ఎంపీపీ తుల శ్రీనివాస్, బోథ్ సర్పంచ్ సురేందర్ యాదవ్, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా సోనాల మండలంలోని పార్డిలో హనుమాన్ జయంతి వేడుకల్లో అసిఫాబాద్ ఆర్డీవో సీడం దత్తు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.


రాజురాలో పూజలునిర్వహిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

బిల్లులు మంజూరుకాక ఆందోళనలో ఉద్యోగులు

ఉట్నూర్, ఏప్రిల్ 23: ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన బిల్లులు ఆర్థిక సంవత్సరం ముగిసిన మంజూరుకాక పోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. గత మార్చి 31 వరకు ఉట్నూర్ ట్రెజరీ కార్యాలయం పరిధిలోని ఉట్నూర్ ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ మండలాల్లోని ప్రభుత్వ ఉద్యోగులతో పాటు వివిధ శాఖలకు చెందిన ఉద్యోగుల సంక్షేమ బిల్లులు, మెడికల్ బిల్లులతో పాటు తదితర బిల్లులను ఉద్యోగులు ట్రెజరీలో అందించారు. అయితే ప్రభుత్వం ఈ-కుబేర్ ద్వారా బిల్లులను మంజూరు చేయాల్సి ఉండగా.. రోజులు గడుస్తున్న బిల్లులు మంజూరు కాకపోవడంతో ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉట్నూర్ ట్రెజరీ పరిధిలో సుమారు రూ.6కోట్లకు సంబంధించిన బిల్లులను ఉద్యోగులు అందించి మంజూరు కోసం ఎదురు చూస్తుండగా ఇటీవల సుమారు రూ.2.85కోట్ల మేర బిల్లులు విడుదల కాగా మరో రూ.3కోట్ల నిధులు విడుదల కావాల్సి ఉన్నట్లు ఉద్యోగులు పేర్కొంటున్నారు. అదేవిధంగా ఆదిలాబాద్ ట్రెజరీ పరిధిలో సుమారు రూ.5కోట్లు, బోథ్ ట్రెజరీ పరిధిలో సుమారు రూ.3కోట్ల మేర బిల్లులను అందించిన ఉద్యోగులు ప్రభుత్వం నిధులు ఎప్పుడు మంజూరు చేస్తుందా? అని ఎదురు చూస్తున్నారు. సంక్షేమ శాఖలకు చెందిన విద్యార్థుల డైట్ బిల్లులు, ప్రభుత్వ ఉద్యోగులకు చెందిన జీతాల ఏరియర్స్, ఇంక్రిమెంట్ల ఏరియర్స్, కాంట్రాక్ట్ ఉద్యోగుల జీతాలు, దినసరి, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు, టెలిఫోన్ చార్జీలు, ఇందన బిల్లులు, వాహనాల అద్దెల బిల్లులకు సంబంధించిన బిల్లులు మంజూరు కాక పోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే బల్లులు మంజూరు చేయాలని కోరుతున్నారు.


ట్రెజరీ కార్యాలయంలో మంజూరు కోసం ఎదురు చూస్తున్న బిల్లులు

ఆదివాసీలకు సీఎం క్షమాపణలు చెప్పాలి : రామన్న

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 23: బీఆర్ఎస్ ఎంపీ ఆదివాసీ అభ్యర్థి పై సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను మాజీ మంత్రి జోగురామన్న తీవ్రంగా ఖండించారు. పార్లమెంట్ ఎన్నికల్లో తమను గెలిపిస్తే పథకాలు సక్రమంగా అమలవుతాయంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఎన్నికల నిబంధనలను అతిక్రమించడమేనని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపిస్తే పలు పథకాలు అమలు చేస్తామని మాట ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం పార్లమెంట్‌లో గెలిపిస్తేనే వాటిని అమలు చేస్తామని మాట మార్చడం వారి చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ అభ్యర్థిని అవమాన పరిచే విధంగా పరుష పద జాలాన్నివాడారని, వెంటనే ఆదివాసీ సమాజానికి ముఖ్యమంత్రి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో జరిగిన సభలో ప్రధాని నరేంద్రమోదీని బడే బాయ్ అంటూ సంబోధించిన వ్యక్తి ఎన్నికల వేళ విమర్శలు చేయడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి లోపల బీజేపీ, బయట కాంగ్రెస్ అన్న విషయంజనజాతర సబతో స్పష్టమయిందన్నారు. ప్రభుత్వాన్ని పడగొడతారంటూ మాజీ సీఎం కేసీఆర్‌పై విమర్శలు చేస్తున్నారన్న ఆయన ప్రభుత్వం కూలుతుందన్న అభద్రత భావంతోనే అవసరర వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. రైతు భరోసా కింద రూ.15 వేలు, రైతు కూలీలకు ఆర్థిక సహాయం, నాలుగు వేల పెన్షన్, కళ్యాణలక్ష్మి కింద తులం బంగారాం హామీలను బుట్టదాఖలు చేశారని మండిపడ్డారు. సీఎం దురహంకారానికి ప్రజలు ఓటు ద్వారానే బుద్ధి చెప్తారని స్పష్టం చేశారు. త్వరలోనే మాజీ సీఎం కేసీఆర్ బస్సు యాత్రలు, బహిరంగ సభలు ప్రారంభం కానున్నాయని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇందులో ఇజ్జగిరి నారాయణ, యూనిస్‌అక్బాని, సాజిదొద్దిన్, యాసంనర్సింగరావు, సలీంపాసా, భూమన్న, పర్వీన్ తదితరులున్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న


గొడుగు నీడలో వేరుశనగను తెంపుతున్న రైతు కూలీలు

ఆదిలాబాద్ జిల్లాలో తీవ్రమైన ఉక్కపోత.. ఈదురుగాలులు

ఆదిలాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో అకస్మాత్తుగా కురుస్తున్న అకాల వర్షాలకు పగలంతా తీవ్రమైన ఉక్కపోతతో జనాలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. సాయంత్రం వేళల్లో ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురు గాలులు వీస్తున్నాయి. జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 42.8 కనిష్ఠ ఉష్ణోగ్రత 23.2 డిగ్రీలుగా నమోదయ్యాయి. జిల్లాలో చాలా చోట్ల 40డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సిరికొండ మండలంలో 41.5, నేరడిగొండలో 40.8 మావలలో 40.5, జైనథ్‌లో 40.2, బీంపూర్‌లో 40.1 గరిష్ఠంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగితా మండలాల్లో 40 డిగ్రీలు ఉంటే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పగలంతా తీవ్రమైన ఎండలు దంచికొడుతున్న రాత్రివేళల్లో అకస్మాత్తుగా జల్లు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో తీవ్రమైన ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. ఈదురుగాలులతో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతుంది. రైతులు ఉదయం సాయంత్రం వేళల్లోనే వ్యవసాయ పనులను చేపడుతున్నారు. మధ్యాహ్నం వేళల్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఎండలో సరైన జాగ్రత్తలు తీసుకుంటూ సాగు పనులు చేస్తున్నారు.

కరెంట్‌షాక్‌తో ఎడ్లు మృతి

ఉట్నూర్, ఏప్రిల్ 23: మండలంలోని సాలెవాడ(బి) గ్రామ పంచాయతీ పరిధిలోని మోతిరాం గూడ గ్రామానికి చెందిన రైతు మేస్రం మెంగుకు చెందిన ఎద్దుల జత కరెంట్ షాక్ తగిలి మంగళవారం మృతి చెందినట్లు రైతు తెలిపారు. సోమవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు తోడుభారీ వర్షం పూర్తిగా కరెంట్ తీగలు తెగిపడ్డాయని, అటువైపు మంగళవారం మేత కోసం వెళ్లిన ఎద్దులుకరెంట్ తీగలకు తగులుకొని మృతి చెందాయని రైతు విలపిస్తూ తెలిపారు. ఈ ఎద్దుల జత మృతి చెందడంతో తనకు రూ.1.20 లక్షల నష్టం వచ్చిందని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు తర్వాత పరిహారం ఇప్పించాలని బాధిత రైతు కోరుతున్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

● భక్తుల రాకతో కిక్కిరిసిన ఆంజనేయస్వామి దేవాలయాలు ● పలు ఆలయాల్లో అన్నదానం ● పలువురు ప్రముఖుల ప్రత్యేక పూజలు


ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు


ఆలయంలో శ్రీహరిరావు పూజలు

ఖానాపూర్, ఏప్రిల్ 23 : హనుమాన్ జయంతి వేడుకలు ఖానాపూర్ మండలంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకలను పురస్కరించుకొని మంగళవారం తెల్లవారుజాము నుండే మండలంలోని పలు ఆంజనేయ స్వామి దేవాలయాలకు భక్తుల తాకిడి కనిపించింది. భారీగా భక్తులు తరలి రావడంతో పట్టణంలోని శ్రీ వీరాంజనేయ శివసాయి సమాజ్ ప్రాంగణంలో గల జంగల్ హనుమాన్ ఆలయం, పద్మావతి నగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, గాంధీనగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆంజనేయ స్వామి ఆలయాల వద్ద ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆంజనేయ స్వామి ఆలయాల్లో పలువురు ప్రముఖులు బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్, ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ సంతోష్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజేందర్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కొక్కుల ప్రదీప్, శనిగారపు శ్రావణ్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు బండారి కిషోర్, కాంగ్రెస్ నాయకులు బక్కశెట్టి కిషోర్, తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నిర్మల్ టౌన్ : నిర్మల్ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో హనుమాన్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు చేపట్టి వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం హారతి కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో శ్రీనగర్ కాలనీ అధ్యక్షులు బొద్దుల భానుచందర్, ప్రధాన కార్యదర్శి ఠాగూర్ రాకేష్ సింగ్, కోశాధికారి కొత్తూరు సాయినాథ్, రాజు, భూమేష్, తిరుపతి, బ్రహ్మయ్య, విష్ణు, సాయి, రమేష్, పురుషోత్తం, లక్ష్మణ్, అశోక్ రావు, కాలనీ వాసులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

నిర్మల్ కల్చరల్ : జిల్లాకేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం హనుమాన్ జయంతి భక్తులు ఘనంగా నిర్వహించారు. స్థానిక భాగ్యనగర్‌లోని రాధాకృష్ణ ఆలయం, బంగల్‌పేట్, ఆదర్శనగర్ తదితర ఆలయాల్లో డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరి రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, నాయకులు భీమ్‌రెడ్డి, చిలుకరమణ, బురాజ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

భైంసా : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణంలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా వార్డుల్లో ఉన్న హనుమాన్ మందిరాల్లో వేకువ జామున 4గంటల నుండే ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అంజన్నకు అలంకరణ, అభిషేకం, మహాహారతి తదితర పూజలు నిర్వహించారు. వాడవాడలా ఉన్న హనుమాన్ ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణ శివారులో ఉన్న కమలాపూర్ దక్షిణముఖి హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. బస్టాండ్ సమీపంలోని హనుమాన్ మందిరంలో పట్టణ సీఐ రాజారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

నర్సాపూర్(జి) : హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం మండలంలోని ఆయా గ్రామాలలో హనుమాన్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ చిత్రపటంతో గ్రామాలలోని పురవీధుల గుండా బాజా బజంత్రీలతో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం హనుమాన్ ఆలయాల దగ్గర భక్తులకు అన్నాదాన కార్యక్రమాలు చేపట్టారు. ఈ శోభాయాత్రలో ఆయా గ్రామాలలోని హనుమాన్ మాలాధారులు, భక్తులు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.మండల కేంద్రంలోని వీర హనుమాన్ ఆలయం వద్ద భక్తులకు మహాఅన్నదాన కార్యక్రమం గ్రామస్థులు, వీడీసీ సభ్యులు ఏర్పాటు చేశారు.

నిలిచి ఉన్న లారీని ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

● దంపతులకు గాయాలు ● 108లో ఆసుపత్రికి తరలింపు ● పరుపుబండ వద్ద మరోప్రమాదం.. ఒకరికి గాయాలు



నసీరాబాద్ గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలతో భార్యాభర్తలు

నర్సాపూర్(జి), ఏప్రిల్ 23 : మండలంలోని నసీరాబాద్ గ్రామం సమీపంలో జాతీయ రహదారిపై నిలిపి ఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో రోడ్డు ప్రమా దం జరిగింది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లోకేశ్వరం మండలంలోని వాటోలి గ్రామానికి చెందిన శివరాత్రిఏగ్గాం చిన్నసాయన్న సోమవారం సారంగాపూర్ మండలంలోని బోరిగాం గ్రామంలో అంత్రక్రియలకు వెళ్ళి తిరిగి ఇంటికి తన భార్యతో ద్విచక్ర వాహనంపై వస్తుండగా జాతీయ రహదారిపై ఏలాంటి సూచనలు పాటించకుండా నిర్లక్షంగా రోడ్డుపై నిలిపిన లారీని వెనుక నుండి ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. భార్య రాధకు భర్త చిన్న సాయన్నకు ముఖంపై, తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108లో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో అధికంగా రక్తం కారడంతో సాయంత్రం ప్రమాదంలో గాయపడిన చిన్న సాయన్న సోదరుడు శివరాత్రిఏగ్గాం నడిపిసాయన్న పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మునిగెల హన్మాండ్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మండలంలోని అంజని తాండా పరుపుబండ అడవి ప్రాంతంలో సోమవారం రాత్రి పదిగంటలకు రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అంజని గ్రామానికి చెందిన పూల్‌సింగ్ (23) మండల కేంద్రానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మార్గ మధ్యలో పరుష బండ అడవి ప్రాంతంలో ఎదురుగా వస్తున్న ట్రాక్స్ తూఫాన్ వాహనం ఢీ కొట్టడంతో ఈ ప్రమాదంలో పూల్‌సింగ్ కుడికాలు విరగడంతో స్థానికులు 108లో ఏరియా అసుపత్రికి తరలించారు. పూల్‌సింగ్ బాబాయ్ రాథోడ్ ఉత్తం పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మునిగెల హన్మాండ్లు తెలిపారు.

andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 37.9 కనిష్ఠం 27.3



నిర్మల్

జిల్లా వార్తలు

బుధవారం 24 ఏప్రిల్ 2024

అక్రమార్కులకు అభయం





చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్కకు వినతి పత్రం ఇస్తున్న స్థానికులు (ఫైల్)

- బాసర గుడిలో కనిపించని క్రమశిక్షణ చర్యలు
- అవకతవకలు వెలుగు చూసినా చర్యలు శూన్యం
- విజిలెన్స్ నివేదిక ఇచ్చినా కట్టడి కాని అవినీతి
- బాధ్యుల విషయంలో దేవాదాయశాఖ మీనమేషాలు
- ఆలయ ప్రతిష్ఠ మంటగలుపుతున్నారంటూ గ్రామస్థుల ఆగ్రహం
- జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు

(బాసర, ఏప్రిల్ 23)

'నిత్యావసర సరుకుల కొనుగోలు టెండరులో పారదర్శకత పాటించలేదు. మార్కెట్ ధరలను పరిశీలించకుండానే అధికధరలకు టెండరును ఖరారు చేశారు. పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహ రించారు. పరిపాలన, పర్యవేక్షణ సరిగా లేక సరుకులు రికార్డుల ప్రకా రం నిల్వలు లేవు. మొత్తం ప్రక్రియలో అధికారుల అలసత్వం నెలకొని ఉంది. ఆలయ ప్రతిష్టను దెబ్బతిసేలా వ్యవహరించారు.'

ఇదీ దేవాదాయశాఖ విజిలెన్స్ నివేదిక సారాంశం

ఏ ప్రభుత్వశాఖ, కార్యాలయంలోనైనా అవినీతి ఆరోపణలు వస్తే ముందుగా విచారణ చేపడుతారు. నివేదికలో అవినీతి రుజువైతే తర్వాత శాఖపరమైన చర్యలుంటాయి. కానీ దేవాదాయశాఖలో మాత్రం వింతధోరణి కనిపిస్తుంది. రూ.కోట్ల అవినీతికి పాల్పడిన ఇంకా చర్యలు మాత్రం కనిపించడం లేదు.



దేవాదాయశాఖ విజిలెన్స్ అధికారుల విచారణ (ఫైల్)

విచారణ చేయించి నివేదిక తీసుకున్నారే కాని బాసర సరస్వతీ అలయ అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసు కోకకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దేవాదాయశాఖలో ఏం చేసిన చెల్లుబాటు అవుతుందనే అభిప్రాయాలకు బాసరలో ప్రస్తుతం జరుగుతున్న ఉదంతం అద్దం పడుతోంది. నిత్యావసర వస్తువుల సరుకుల కొనుగోలు అక్రమాల్లో బాధ్యులపై చర్యలు తీసుకోక పోవడం స్థానికులను ఆగ్రహానికి గురిచేస్తుంది. అదివారం బాసరకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జీ మంత్రి అనసూయ సీతక్కకు దృష్టికి తీసుకెళ్లారు. ఈ అవినీతిలో ఆలయ కీలక అధికారుల పాత్ర ఉండడం వల్లనే చర్యలు తీసుకోవడం లేదని వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇచ్చారు.

చర్యలు ఏవి ?

బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో నిత్యావసర వస్తువుల కొనుగోలులో భారీగా నిధులు పక్కదారి పట్టాయి. మార్కెట్ ధరకంటే ఎక్కువ ధరకు కొనుగోలు చేయడమేగాకుండా ఎంఆర్‌పీ కంటే అధిక ధరలు చెల్లింపు విషయమై ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఈ ఏడాది మాత్రమే జరిగింది కాదు. గత కొన్నేళ్ల నుంచి కొనసాగుతున్న అవినీతి బాగోతమిది. ఏడాదికి దాదాపు 8 కోట్లకు పైగా వస్తువులు కొనుగోలు జరుగుతుంది. మార్కెట్ ధరలతో పోలిస్తే 30-40 శాతం అధిక ధరలకు కొనుగోలు చేశారు. ఈ లెక్కన ఏడాదికి రూ. 2 నుంచి 3 కోట్ల నిధులు పక్కదారి పట్టినట్లు తెలుస్తుంది. ఒక్క బగారాకును గ్రాముల్లో లేదంటే కిలోల్లో కొనుగోలు చేస్తాం కాని ఒక్కో ఆకుకు రూ.3లు చొప్పున కొనుగోలు చేశారంటే బాసర ఆలయ అధికారుల నిర్లక్ష్యానికి సాక్ష్యంగా నిలుస్తుంది. అమ్మవారి నిధులకు రక్షణగా ఉండాల్సిన అధికారులే కంచె చేను మేసిన చందంగా కొందరు కీలక అధికారులే అందినకాడికే దండుకున్నారు.

లెక్కలేని సరుకులపై విచారణ ఏది ?

దేవాదాయశాఖ విజిలెన్స్ అధికారుల నివేదికలో దేవస్థానంలో రికార్డు ప్రకారం ఉండాల్సిన సరుకులు నిల్వగదిలో లే వని తేలింది. రికార్డు కంటే తక్కువ పరిమాణంలో సరుకులు ఉన్నట్లు నివేదిక ఇచ్చారు. సరుకులు మాయం కావడంపై ఇప్పటి వరకు దేవస్థాన అధికారులు విచారణ చేపట్టలేదు. సరుకులు ఎంత మొత్తంలో తక్కువ ఉన్నాయి. ఎటు వెళ్లాయి.. ఎవరు తరలించారు... అనే విషయాలపై ఆలయ అధికారులు కాని, దేవాదాయ శాఖ అధికారులు కాని విచారణ చేపట్టడం లేదు. పెద్దఎత్తున సరుకులు మార్కెట్‌కు తరలించి కొందరు విక్రయించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. యాలకులు వంటి తక్కువ పరిమాణం ఎక్కువ ఖరీదు ఉండే వస్తువులను మహారాష్ట్ర ధర్మాబాద్ మార్కెట్‌కు తరలించినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. మరికొన్ని సరుకులు ఇండ్లకు సైతం కొందరు ఉద్యోగులు తరలించినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసు విచారణ చేపడితేనే అసలు విషయాలు వెలుగుచూస్తాయని స్థానికుల నుంచి అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నిద్రావస్థలో జిల్లా అధికారులు

చిన్న కిరాణాదుకాణాల్లో ఎంఆర్‌పీ కంటే రూపాయి ఎక్కువ తీసుకుంటేనే హడావుడి చేసి కేసులు నమోదు చేసే అధికారులు బాసర ఆలయంలో సరుకుల కొనుగోళ్ల అక్రమాలపై చోద్యం చూస్తున్నారు. భారీ స్థాయిలో సరుకులు కొనుగోళ్లు జరిగే బాసర సరస్వతి ఆలయంలో ధరల విషయంలో అవకతవకలు జరిగితే ఇప్పటికీ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఎంఆర్‌పీ ధర కంటే ఆలయ అధికారులు ఎక్కువ ధర చెల్లించి కొనుగోలు చేసినప్పటికి అధిక ధరలకు విక్రయించడం మాత్రం నిబంధనలకు విరుద్ధం. అలా ఎంఆర్‌పీ ధర కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే తూనికల కొలతలు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్స్, వాణిజ్యశాఖ అధికారులు ఇలా ఎవరైనా చర్యలు తీసుకోవచ్చు. బాసర ఆలయానికి నిత్యావసర సరుకులను ఎంఆర్‌పీ కంటే ఎక్కువ వసూలు చేసిన సదరు వ్యాపారిపై జిల్లా అధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉంది. చివరికి లైసెన్సును కూడా క్యాన్సల్ చేసే అవకాశం అధికారులకు ఉంది. అయినా ఇప్పటి వరకు అధికారుల్లో చలనం లేదు.

ఖానాపూర్‌లో బీఆర్ఎస్‌కు షాక్

- కాంగ్రెస్‌లో చేరిన పలువురు బీఆర్ఎస్ నాయకులు
- బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ గూటికి చేరిన పీఏసీఎస్ చైర్మన్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి, మాజీ అధ్యక్షులు సహా పలువురు నాయకులు



కాంగ్రెస్ పార్టీలో చేరిన అనంతరం ఎమ్మెల్యే బొజ్జును సన్మానిస్తున్న గోసంపల్లె నాయకులు

ఖానాపూర్, ఏప్రిల్ 23 : పార్లమెంట్ ఎన్నికల వేళ ఖానాపూర్‌లో బీఆర్ఎస్ పార్టీకి షాక్ తగిలింది. గత కొద్ది రోజులుగా నియోజకవర్గంలో ముఖ్య పదవుల్లో ఉన్న నాయకులంతా ఒక్కొక్కరుగా బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు. తాజాగా మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంతో పాటు గోసంపల్లె గ్రామంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పలువురు బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. సత్తెనపల్లి పీఏసీఎస్ ఛైర్మన్ ఆమంద శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తూము చరణ్ కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మండల అధ్యక్షులు బక్కశెట్టి కిషోర్, ఖానాపూర్ మాజీ సర్పంచ్ బక్కశెట్టి లక్ష్మణ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు దాసరి రాజన్న, కాసారపు మల్లయ్య, అమరవేణి శంకర్ గౌడ్, ఎస్. సత్యనారాయణ, నల్ల రాజేశ్వర్, బక్కశెట్టి శ్రీనివాస్, ఇస్తారి రాములు, వీరగోని శ్రీనివాస్, కే. గంగాధర్ సహా పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారిని ఎమ్మెల్యే బొజ్జు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలకి ఆహ్వానించారు. పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపు కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే బొజ్జు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికేని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు తోటసత్యం, సత్యం, లక్ష్మీపతిగౌడ్, తదితరులున్నారు.

ఉచిత అంబలి పంపిణీని ప్రారంభించిన ఎమ్మెల్యే

వేసవికాలంలో ఉచిత అంబలి పంపిణీ నిర్వహించడం అభినందనీయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. కడెం మండలం నచ్చన్ ఎల్లాపూర్‌లో స్థానిక తాజా మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అంబలి పంపిణీ కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు కేవలం రాజకీయాలకే పరిమితం అవ్వడం కాకుండా ప్రజాసేవలో ముందుండాలన్నారు. గత కొన్నేళ్లుగా ప్రతి వేసవికాలంలో ఉచిత అంబలి పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్న బొడ్డు గంగన్నను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కడెం మండల అధ్యక్షులు మల్లేష్, నాయకులు పోతరాజుల గంగన్న, భూషణ్, శ్రీనివాస్, మహేందర్, వెంకటేష్‌తో పాటు స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ పరిశీలన



కుంటాల, ఏప్రిల్, 23: మండల కేంద్రం కుంటాలలో గల పోలింగ్‌బూత్‌ను మంగళవారం తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్ పరిశీలించారు. మే 13న పార్లమెంట్ ఎన్నికలు జరనున్న దృష్ట్యా ఓటర్లకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలింగ్‌బూతులో తాగునీరు. ర్యాంప్ సౌకర్యం విద్యుత్‌సౌకర్యం, టాయిలెట్స్ వివిధ సౌకర్యాలు ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఈయన వెంట ఆర్ఐ అడెల్లు తదితరులు ఉన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యం పట్టివేత

55 క్వింటాళ్లు స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు పోలీసులు



ఖానాపూర్ పద్మావతి నగర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు

ఖానాపూర్, ఏప్రిల్ 23 : అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ ఎస్సై లింబాద్రి తెలిపిన కథనం ప్రకారం... మంగళవారం పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచినట్లు సమాచారం అందింది. దీంతో పట్టణంలోని పద్మావతి నగర్‌లో మూడు వేరు వేరు చోట్ల అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని నిల్వ చేసిన ప్రాంతాలలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 110 సంచుల పీడీఎస్ బియ్యం పట్టుబడినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. పట్టుబడిన బియ్యం సుమారు 55 క్వింటాళ్ల వరకు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచిన కడమంచి లక్ష్మణ్, పాతం పోశెట్టి, గడ్డం ప్రభాకర్ అనే ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రధానిమోదీపై ఆరోపణలు చేస్తే సహించం

- ముథోల్ ఎమ్మెల్యే రాంరావు పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంరావు పటేల్

భైంసా, ఏప్రిల్ 23: పదేళ్ల బీజేపీ పాలనలో ఎలాంటి మచ్చలేని మనిషి ప్రధాని నరేంద్రమోడీ అని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావు పటేల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్ఎస్ జిన్నింగ్ మిల్లులోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రెండ్రోజుల క్రితం ఆదిలాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోడీపై చేసిన ఆరోపణలపై ఎమ్మెల్యే కౌంటర్ ఇచ్చారు. రాంజీగోండు, కొమురంభీం తెల్లదొరలతో పోరాడారని సీఎం మాట్లాడిన మాటలు అబద్ధాలన్నారు. భారతదేశంలో తెలంగాణ ప్రాంతం ఆ సమయంలో నైజాం పాలనలో ఉందని గుర్తు చేశారు. కేవలం ఇక్కడి ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకోవడం కోసమే ముఖ్యమంత్రి ఇలాంటి ఆరోపణలు, మరోమారు ఇలాంటి ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. 140 కోట్ల మంది ప్రజలను సమానంగా పరిపాలించే దక్షిత ప్రధాని మోడీ అని అన్నారు. ఓటుకు నోటు కేసు ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఇంత వరకు నేరవేర్చలేదని, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని నమ్మేలా లేరన్నారు. తెలంగాణలో 10 నుంచి 12 సీట్లు గెలిచితీరుతామని ధీమా వ్యక్తం చేశారు. రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ ఈ ఏప్రిల్‌లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మన్ రాజేష్ బాబు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారాయణ్ రెడ్డి, రవిపాండే, ముథోల్ నియోజకవర్గ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్ తదితరులున్నారు.

బడులు తెరిచేలోపు పనులు పూర్తి చేయాలి : కలెక్టర్



న్యూ లింగంపల్లి పాఠశాలలో పనులు పూర్తి చేయాలని అధికారులకు చెబుతున్న కలెక్టర్

మామడ, ఏప్రిల్ 23 : బడులు తెరిచే లోపు అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మంగళవారం మండలంలోని న్యూ లింగంపల్లి ప్రాథమిక పాఠశాలలో చేపట్టి అమ్మ ఆదర్శ పనులను జిల్లా విద్యాశాఖ అధికారి డా. ఏ.రవీందర్‌రెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ ఈఈ శంకరయ్య కలిసి పరిశీలించారు. కేటాయించిన అన్ని పనులను గడువులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అమ్మ ఆదర్శ పాఠశాలలో కేటాయించిన అన్ని పనులను, ఆయా పాఠశాలల పరిధిలోని మండల ఏఈలు క్షేత్ర స్థాయిలో మరొకసారి పరిశీలించి పాఠశాల అవసరాల మేరకు, అత్యవసరమైన పనులను నిర్ణయించి వాటిని మాత్రమే పూర్తి చేయాలని ఇంజనీర్లకు ఆదేశించారు. న్యూ లింగంపల్లి ప్రాథమిక పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల మరమ్మతు పనుల నిమిత్తం మొత్తం 1,97,000 రూపాయలు అవసమరని నిర్ణయించారు. పరిపాలన అనుమతులు మంజూరు చేయడం జరిగిందని, ఇప్పటికై 25 శాతం నిధులు 47,000 ల రూపాయలు పాఠశాల ఖాతాలో జమ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. నిధులు ఉన్నందున పాఠశాల పనులను వెంటనే ప్రారంభించి, పూర్తి చేయాలని వారికి సూచించారు. పాఠశాలలో ఇప్పటికే మరమ్మతుల కోసం తెచ్చిన సామాగ్రిని, వాటి నాణ్యతను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఇక్కడి పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రగతిపత్రాలు కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి రాజేశ్వర్, ప్రవీణ్ కుమార్‌లు, ఇంజనీరింగ్ అధికారులు, డీసీ ఈబీ కార్యదర్శి భానుమూర్తి, మాజీ సర్పంచ్ నూనెల గంగాధర్, వీవో ఛైర్మన్ నల్ల సాయవ్వ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి : అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



మిషన్ భగీరథలో నీటిసామర్థ్యం పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



కల్లూర్ గ్రామంలో అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

భైంసా, ఏప్రిల్ 23: భైంసా పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు వేసవి కాలంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు. మంగళవారం భైంసా పట్టణంలోని గడ్డెన్న ప్రాజెక్టు సమీపంలో గల మిషన్ భగీరథను సందర్శించారు. అక్కడ జరుగుతున్న నీటి శుద్ధి, ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు, సామర్థ్యం తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. శుద్ధమైన నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించి నీటి సరఫరాకు అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ సిబ్బంది ఉన్నారు.

కుంటాల, ఏప్రిల్, 23 : గ్రామాలలో వేసవి కాలం దృష్ట్యా ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. మంగళవారం మండలంలోని కల్లూర్ గ్రామంలో తాగునీటి సరఫరా గురించి అధికారులకు అడిగి తెలుసుకున్నారు. అంతేగాకుండా గ్రామంలోని పారిశుధ్యం పనులు, మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. ప్రయాణ ప్రాంగణంలో చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రయాణికులకు తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఈయన వెంట వ్యవసాయ ఆధికారి సోమలింగా రెడ్డి, ఏపీవో నవీన్, పంచాయతీ సెక్రటీలు తదితరులు ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

- పరారీలో మరో నలుగురు వ్యక్తులు
- కేసు వివరాలు వెల్లడించిన ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్



గంజాయి కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్

భైంసా, ఏప్రిల్ 23: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నట్లు ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. మంగళవారం భైంసాలోని సబ్ డివిజన్ పోలీసు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి కేసు వివరాలను వెల్లడించారు. పట్టణంలోని ఖాజీగల్లీకి చెందిన ముజాయిద్‌ఖాన్, రాహుల్ నగర్‌కు చెందిన షేక్ మక్బూల్‌లు మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన షరీఫ్ అనే వ్యక్తి వద్ద నుండి గంజాయి తీసుకొచ్చి భైంసాతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల్లో విక్రయిస్తున్నారు. పక్క సమాచారం మేరకు సోమవారం సాయంత్రం పట్టణ ఎస్సై షరీఫ్, సిబ్బంది తనికీలు చేశారు. అయితే మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకవస్తున్న ముజాయిద్‌ఖాన్, షేక్ మక్బూల్‌లను పట్టుకొని వారి వద్ద నుండి 1145 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారి విచారించగా మరో నలుగురు రాహెల్, తురుబ్‌ఖాన్, బారీ అనే ముగ్గురు వ్యక్తులు సైతం గంజాయి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. వీరు ప్రస్తుతం పరారీలో ఉన్నారని, త్వరలోనే పట్టుకుంటామని ఏఎస్పీ పాటిల్ తెలిపారు. గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేసును చేధించిన సీఐ రాజారెడ్డి, ఎస్సై షరీఫ్, కానిస్టేబుళ్ల నాగభూషణ్, గజేందర్, శైలేష్‌లను ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ అభినందించారు.

సంక్షిప్త సమాచారం

అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

- ఇద్దరికి గాయాలు



విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి రోడ్డు పక్కన ఉన్న టేలలోకి దూసుకెళ్లిన కారు

ఖానాపూర్, ఏప్రిల్ 23 : కడెం మండలంలోని ధర్మాజీపేట్ గ్రామంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే కడెం ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి తెలిపిన కథనం ప్రకారం.. కడెం మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన నలిమెల అనిల్ అనే వ్యక్తి కన్నాపూర్ వెళ్లి తిరిగి నర్సాపూర్ వస్తుండగా ధర్మాజీపేట్ వద్ద కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడమే కాకుండా రోడ్డు పక్కన ఉన్న టేలల్లోకి దూసుకువెళ్లడంతో కారులో ఉన్న డ్రైవర్ అనిల్ సహా శివానంద్ అనే వ్యక్తికి తలకు గాయాలయ్యాయి. అతివేగంగా అజాగ్రత్తగా నడపడం వల్లనే ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ప్రమాదానికి కారకుడైన డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గంజాయి అమ్ముతున్న వ్యక్తుల అరెస్ట్



వివరాలు తెలుపుతున్న డీఎస్పీ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 23 : నిర్మల్ పట్టణంలో మంగళవారం గంజాయి అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. సీఐ ఆదేశం మేరకు పట్టణ ఎస్సై ఏ. రాజేశ్వర్ గౌడ్ కురన్నపేట్ కాపు సంఘం వద్ద తోకల రాజేశ్వర్ ఒక ప్లాస్టిక్ కవర్‌లో 245 గ్రాముల గంజాయి అమ్మేందుకు ప్రయత్నించగా పట్టుకున్నారని తెలిపారు. అతడిని విచారించగా షైక్ సోహెల్ వద్ద కొని తాను అమ్మేందుకు ప్రయత్నించినట్లు తెలిపారన్నారు. సోహెల్‌ను కూడా బస్టాండ్ వద్ద పట్టుకొని 139 గ్రాముల గంజాయితో పాటు అమ్మగా వచ్చిన 4,410 రూపాయలు స్వాధీనపరచుకొని రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ తెలిపారు.

28 వరకు పాలీసెట్‌కు దరఖాస్తు గడువు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 23 : పాలిటెక్నిక్ కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తు గడువు ఈ నెల 28 వరకు పొడిగించినట్లు నిర్మల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ ఒక ప్రకటనలో తెలిపారు.